నిమజ్జనాలు.. పటిష్ఠ భద్రత

పటాన్‌చెరు టౌన్: గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని సాకి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. డీజేలకు అనుమతి లేదన్నారు. మండపాల నిర్వాహకులు మధ్యాహ్నం శోభయాత్రను ప్రారంభించి, రాత్రి 12 గంటల లోపు నిమజ్జనం పూర్తి చేయాలన్నారు.

5 లక్షల మంచినీటి ప్యాకెట్లు రెడీ

బంజారాహిల్స్: జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, డైరెక్టర్ ఆపరేషన్స్ విజయారావు, సీజీఎం ప్రభు, డివిజన్ -6 జీఎం హరి శంకర్ నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, అమీర్‌పేట, పంజగుట్ట ప్రధాన రహదారుల్లో నిమజ్జన శోభాయాత్ర, నిమజ్జనం జరిగే ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే గుర్తించిన ప్రాంతాల్లో ఉచిత మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. జలమండలి డివిజన్-06 పరిధిలో ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, ఈఎస్ఐ, పంజగుట్ట, ఆర్టీఏ కార్యాలయం, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా, ఎస్పీటీనగర్ కమాన్, బోరబండ ప్రాంతాల్లో మంచినీటి క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 10 చోట్ల ఏర్పాటు చేస్తున్న ఈ క్యాంపుల ద్వారా 5 లక్షల నాణ్యమైన మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేయాలని తలపెట్టారు. శోభాయాత్ర జరిగే మార్గాల్లో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కాకుండా ఆరు ఎయిర్‌టెక్ మిషన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తలెత్తకుండా చూసేందుకు 24 గంటలపాటు 60 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

ఏ వైరు..ఎక్కడుందో..

ఒకే కరెంట్ స్తంభానికి కరెంట్, కేబుల్ వైర్లు ● వర్షం కారణంగా షార్ట్‌సర్క్యూట్‌లు



స్తంభాలకు తీగలు అల్లుకుపోయిన దృశ్యం

మాదాపూర్: మాదాపూర్‌లోని డాక్టర్స్ కాలనీ, సాయినగర్, అయ్యప్పసొసైటీ తదితర ప్రాంతాలలో కరెంట్ స్తంభాలకు కేబుల్‌వైర్లు ఏర్పాటు చేయడంతో ఇబ్బందికరంగా ఉంది. ఒకే స్తంభానికి కరెంట్ వైర్లు, కేబుల్ వైర్లు ఉండడంతో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. వర్షాకాలం కరెంట్ పోయిందంటే వైర్లను సరిచేయడానికి విద్యుత్ సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. ఏ వైరు ఎక్కడుందో గుర్తించడం కష్టంగా ఉందని వారు పేర్కొంటున్నారు. కేబుల్ వల్ల ఏదైనా సమస్య తలెత్తితే రోజులు తరబడి పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దనే కేబుల్ వైర్లను ఏర్పాటు చేశారు. కరెంటు వైర్లు పక్కన కేబుల్ వైర్లు ఉండడంతో ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదకర పరిస్థితి నెలకొంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. వర్షాకాలం ఓల్టేజీ సమస్య వస్తుందని దీనిపై ఫిర్యాదు చేస్తే వైర్లు అడ్డంగా ఉన్నాయని తరువాత చేస్తామని సిబ్బంది వెళ్ళిపోతున్నారని వాపోయారు. కేబుల్ వైర్లను కరెంట్ స్తంభాలకు కాకుండా ప్రత్యేకంగా స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలని స్థానికులు పేర్కొంటున్నారు.









ఇళ్ల పక్కన ప్రమాదకరంగా కరెంట్ స్తంభాలు





మాదాపూర్‌లోని డాక్టర్స్ కాలనీలో కరెంట్ స్తంభాలకు కేబుల్ వైర్లు

నేడు గణేష్‌గడ్డ జాతర

ముగియనున్న ఉత్సవాలు



పటాన్‌చెరు టౌన్: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్‌గడ్డ దేవస్థానం సోమవారం భక్తులతో కిటకిటలాడింది ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో గణనాథుని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గణేష్‌గడ్డ ఉత్సవాలలో చివరిరోజు మంగళవారం జరగనున్న జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో శశిధర్, జూనియర్ ,అసిస్టెంట్ ఈశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారి లడ్డూ వేలం, రథోత్సవం ఉంటుందని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో డబుల్ ఇళ్ల అసోసియేషన్ సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుల దృష్టికి తీసుకువెళ్ళి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు సయ్యద్ గౌస్, భారత్, కార్తీక్, రవి, శ్రీనివాస్, ప్రసాద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాలకు వాహనాలు కేటాయింపు



గచ్చిబౌలి: ఆర్టీఏ అధికారులు, భాగ్యనగ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనాల కోసం భారీ వాహనాలను కేటాయించారు. నేడు హుస్సేన్‌సాగర్‌లో జరగనున్న నిమజ్జనాల కోసం గచ్చిబౌలి స్టేడియం ముందు వాహనాలను సిద్ధంగా ఉంచారు. గణేష్ ఉత్సవ సమితిలో దరఖాస్తు చేసుకున్న వారికి సీరియల్ ప్రకారం లారీలు, డీసీఎంలు కెటాయించారు. మరో 70 వాహనాలు రెడీ చేస్తున్నామని కొండాపూర్ ఎంవీఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్, మెహిదీపట్నం ఎంవీలు కిరణ్ రెడ్డి, నవీన్‌కుమార్, కృష్ణవేణి, శ్రీనివాస్‌రావు, ఆనంద్ శ్యామ్ ప్రసాద్, వెంకట సురేష్, సునీత, ఉపాసన పాల్గొన్నారు.

సత్వరం సమస్య పరిష్కరించాలి : ఎమ్మెల్యే గాంధీ



శాంతినగర్‌లో కుంగిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎమ్మెల్యే గాంధీ పరిశీలన

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో రోడ్డు అకస్మాత్తుగా కుంగడంతో ఏర్పడిన భారీ గుంతను సోమవారం జలమండలి జీఎం బ్రిజేష్, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ నాలాలోని నీరు డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లోకి చేరడంతో సుమారు 5 మీటర్లు పొడవు, 2 మీటర్ల లోతులో రోడ్డు కుంగిపోయి భారీ గుంత ఏర్పడిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుంత వైపు వెళ్ళకుండా గుంత చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం బ్రిజేష్, డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ బిక్కులాల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, కృష్ణ రావు, భవానీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

అన్నదానం

కూకట్‌పల్లి: మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఖాజానగర్, ఎల్లమ్మబండలోని మసీదుల్లో సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వాలను బోధించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు సయ్యద్ గౌస్, నవాజ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

కాలుష్యాన్ని అరికట్టాలి

హెచ్‌సీయూ ప్రొ. కిషోర్‌కుమార్





జేఎన్‌వీలో ప్రమాణం చేస్తున్న ప్రొ. కిషోర్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు

రాయదుర్గం: జీవకోటిని కాపాడేది ఓజోన్ పొర అని దీన్ని రక్షించుకోవాలంటే కాలుష్యాన్ని అరికట్టాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి కిషోర్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్ అధ్యక్షతన సోమవారం గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యత, దానిని రక్షించవలసిన ఆవశ్యకతపై అవగాహన పెంచడానికి ఐక్యరాజ్య సమితి వారు ప్రతి ఏటా ఒక నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారన్నారు. ఈ ఏడాది 'వాతావరణ చర్యను అభివృద్ధి చేయటం' అనే నినాదంతో నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఓజోన్ పొర సూర్యుని నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాల నుంచి భూమిని రక్షించే కవచంగా పనిచేస్తుందన్నారు. అడవులను నరికివేయడం, కాలుష్యం పెరగడంతో ఓజోన్ పొర తరిగిపోయి భూతాపం పెరగడం, వానలు కురవక పోవడం వంటి అనర్థాలను ఎదుర్కొంటున్నామన్నారు. అంతేకాకుండా మానవులు క్యాన్సర్, కంటి జబ్బులు, వడదెబ్బ బారిన పడుతున్నారన్నారు. జేఎన్‌వీ వైస్ ప్రిన్సిపల్ మిత్రి, అధ్యాపకుడు శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు అమ్మయ్యచౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాటం ఆదర్శం..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ రైతాంగ పోరాటం ఆదర్శంగా నిలిచిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, అధ్యక్షులు సాయిలు అన్నారు. సోమవారం భెల్ కాలనీలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్య్రానికి ముందే నిజాం నవాబుకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం ఈ పోరాటాలు జరిగాయని వివరించారు. నాటి ఈ పోరాటం ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. నాయకులు వెంకటరాజ్యం, లక్ష్మణ్, బాబు, శంకరయ్య, శివ పాల్గొన్నారు.

240 మంది సిబ్బందితో బందోబస్తు: ఏసీపీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్, మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం జరిగే వినాయక నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. మొత్తం 240 మంది సిబ్బందితో ఈ బందోబస్తు ఉంటుందన్నారు. బంజారాహిల్స్ మొత్తం 294 విగ్రహాలకు గాను ఇప్పటికే చాలావరకు నిమజ్జనం అయ్యాయని, ఆఖరి రోజైన మంగళవారం 74 విగ్రహాలు నిమజ్జనానికి తరలుతాయని పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్ పరిధిలో 47 విగ్రహాలకు గాను చివరిరోజు 13 విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎనిమిది పికెట్లు బంజారాహిల్స్, మరో ఎనిమిది పికెట్లు మాసబ్‌ట్యాంక్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఆరు పుషింగ్ పార్టీలు, ఒక వాచ్‌టవర్, రెండు స్టాటిక్ జనరేటర్లు, నాలుగు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు, మూడు మొబైల్ టీమ్‌లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఏసీపీతోపాటు నలుగురు సీఐలు, 30 మంది ఎస్ఐలు, 180 మంది కానిస్టేబుళ్ళు, 20 మంది హోంగార్డులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ప్రతీ వాహనంలో ఒక జవాన్ నిమజ్జనం వరకు వెళ్ళి తిరిగి అదే పాయింట్‌కు చేరుకున్నాక పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిపోర్ట్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. విగ్రహాలు తరలించే వాహనాల్లో టపాకాయలు, లాఠీలు, రాళ్ళు ఉంచకూడదన్నారు. రంగులు చల్లవద్దని, డీజేలు నిషిద్ధమని పేర్కొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు పనుల పరిశీలన



గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ అంబీర్ చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చేపడుతున్న గుర్రపుడెక్క తొలగింపు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సోమవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు చుట్టుపక్కల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, దేవి, నాయకులు నిరంజన్‌గౌడ్, నిఖిల్ పాల్గొన్నారు.

శోభాయాత్రలో కలర్ షాట్స్ వద్దు

బంజారాహిల్స్: గత నాలుగైదు రోజుల నుంచి జరుగుతున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్రల సందర్భంగా నిర్వాహకులు రంగురంగుల పేపర్లతో కూడిన కలర్‌షాట్స్‌ను వినియోగిస్తున్నారు. ఇవి రోడ్లపైన పడటంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. స్వీపర్లు రోడ్లు ఊడుస్తున్నా ఇవి రోడ్డుకు అలాగే అంటుకుపోయి ఉంటున్నాయి. దీంతో మంగళవారం జరగనున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు కలర్ షాట్స్ వినియోగించవద్దంటూ ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, అమీర్‌పేట, పంజగుట్ట రహదారుల్లో బ్యానర్లు పట్టుకొని అవగాహన కల్పిస్తున్నట్లు సర్కిల్-17 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై శోభాయాత్ర నిర్వాహకులు జీహెచ్‌ఎంసీకి సహకరించాలని కోరారు.

చిన్నారులకు సర్టిఫికెట్ల అందజేత

మోతీనగర్: సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం వారికి అందించవలసిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం చైర్మన్ వీఎస్‌వీ సత్యనారాయణ పేర్కొన్నారు. గత తొమ్మిది రోజుల నుంచి మూసాపేట పాండురంగనగర్‌లోని ఆలయంలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు పాండురంగనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి. ఉదయ్‌కుమార్‌తో కలిసి ఆయన సర్టిఫికెట్‌లను, షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సంప్రదాయాలు, దేశభక్తి, ఆధ్యాత్మికత గురించి తెలుసుకుని ఎదగాలన్నారు.

హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్‌తో బట్టతల సమస్య పరిష్కారం

మాదాపూర్: పోలిక్యులర్ యూనిట్ ఎక్స్‌ట్రాక్షన్ వంటి ఆధునిక హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ విధానాలు అత్యంత సురక్షితమైనవని డాక్టర్ రాజశేఖర్ మాదాల తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో మూడునెలల్లో 100కి పైగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చాలామందిని ప్రభావితం చేసే సాధారణ సమస్య జుట్టు రాలడం, 85 శాతం కంటే మంది పురుషులు, 40శాతం స్త్రీలు బట్టతల సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వంశపారంపర్యంగా, ఒత్తిడి, హార్మోన్ల మార్పులు, సరైన ఆహారం, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలు కూడా సమస్యలకు దోహదం చేస్తున్నాయన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



మియాపూర్ డివిజన్‌లో గణేశుని పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

గణేశ్ ఉత్సవాల్లో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం గణపతులు గంగమ్మ ఒడికి చేరనున్నారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



మియాపూర్‌లో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, తదితరులు



మధురానగర్‌లో.. మాజీ కార్పొరేటర్ సాయిబాబా, ఉత్సవ కమిటీ సభ్యులు



చందానగర్‌లో.. కార్పొరేటర్ మంజులారెడ్డి తదితరులు



మియాపూర్‌లో.. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

పోటాపోటీగా లడ్డూ వేలం పాటలు



రూ.5.51 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న మీనా మహేందర్‌గౌడ్

వినాయకచవితి ఉత్సవాలలో లడ్డూకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆది, సోమవారాల్లో గచ్చిబౌలి, కొండాపూర్, గోపన్‌పల్లి, శ్రీరామ్‌నగర్, ఖాజాగూడ ,నల్లగండ్ల హుడా కాలనీలలోని గణేష్ మండపాల వద్ద నిర్వహించిన వేలంపాటల్లో లడ్డూలు లక్షలు పలికాయి.

– గచ్చిబౌలి/రాయదుర్గం



గోపన్‌పల్లిలోని ఈదమ్మ, పోచమ్మ ఆలయంలో.. రూ.4.25 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న శ్రీరాములు



కొండాపూర్‌లో రూ.3,16,116కు లడ్డూను కైవసం చేసుకున్న మాధవిరాము దంపతులు



ఖాజాగూడలో కుమ్మర సంఘం లడ్డూను రూ.1.31 లక్షలకు పొందిన ప్రవీణ్‌కుమార్



నాగార్జున రెసిడెన్సీలో లడ్డూను రూ.1.8 లక్షలకు కైవసం చేసుకున్న చంద్రమోహన్



లడ్డూను రూ.5,60,000 లక్షలకు దక్కించుకున్న గిరిజ మార్వెల్ అపార్ట్‌మెంట్‌వాసులు, సొసైటీ సభ్యులు



టీమ్ అబోడ్‌లోని కొత్త రమేష్‌కు లడ్డూ అందజేస్తున్న సొసైటీ సభ్యులు